# కాలింగ్ బెల్

—ఆనందరావ్



"ఏమండీ! మన ఇంటికి ఇన్నిహంగులు ఉండి, కాలింగ్ బెల్ ఒక్కటే లేకపోవడం బావోలేదండీ. మంచి బెల్ ఒకటి కొనరాదా?" అన్న మా ఆవిడ మాటలతో నాలో చాలా రోజులై బలంగా పాతుకు పోయిన ఇష్టమైన కోర్కె మళ్ళా చిగురించింది.

ఇంటి హంగులంటే ఏమిటనుకున్నారు. నేమ్ బోర్డు, డోర్ కర్టెన్, విండో కర్టెన్—ఇవే మా ఆవిడ దృష్టిలో హంగులు. ఇక పోతే నా ఖరీదైన కోర్కె గురించి కాస్త చెప్పదలచుకున్నాను. నేను బిఏలో చదువుకొనే రోజుల్లో మా ఇంటి పక్కనే ఉండే గుజరాతీల ఇంటిలో ఒక డింగ్ డాంగ్ బెల్ ఉండేది. మీట నొక్కగానే సంగీతం పలికించే ఆ కాలింగ్ బెల్ సొంతదారుడిని కావాలనే కాంక్ష నా మనస్సులో నిలిచిపోయింది. ఇన్నాళ్ళకి ఆ కోర్కె ఫలించబోతున్నందుకు తీయని కలలు కంటూ నిద్రపోయాను.

ఆ నెల బడ్జెట్ వేసుకున్నాను. అప్పే మిగులు లేదు. నాకు ఒకే ఒక మార్గం కన్పించింది. ఆ నెల ఇన్స్యూరెన్సు ప్రీమియమ్ కట్టకుండా నేరుగా బజారుకి వెళ్ళాను. షాపతను రకరకాల బెల్స్ చూపించాడు. అలనాడు గుజరాతీల ఇంటిలోని బెల్ లాంటిది కాక పోయినా, అలానే మ్యూజిక్ వచ్చేటటువంటి బెల్ ఏభయికి, మిగతా ఆ బాపతుకి సంబంధించినవస్తువులకు మరో పదిహేను ఖర్చుచేసి మా ఆవిడకు ఇచ్చిన వాగ్దానం నిలుపుకున్నాను.

ఒక రోజల్లా కష్టపడి రెండు సార్లు మెయిన్ ఫ్యూజ్యులు, మూడవసారి పోక్సైన ఫ్యూజ్యులు మొత్తంమీద ఎలాగోలా కాలింగ్ బెల్ అమర్చాను. బెల్ ఎవరైనా నొక్కి పిలుస్తే గభాలున వెళ్ళి తలుపులు తెరవకూడదని మా ఆవిడకు చెప్పాను. "డింగ్ డాంగ్" అనగానే—"ఎస్. కమింగ్" అని అనాలన్నట్లు చెప్పాను.

మర్నాడు దబ దబ తలుపు మోతతో విసుగ్గా వెళ్ళి తలుపుతేసి చూశాను. ఎదురుగా పాలవాడు. "బెల్ ఉంది కనపడ్డం లేదా? బాదడమేమిటి?" అన్నాను.

"ఏమియ్యోయ్ కళ్ళు, ఒళ్ళు అంటుందావే. ఇష్టమయితే పాలు పోయించుకో, కష్టమయితే మానేయ్. గట్టా నోరు పారబోసుకోక."

ప్రొద్దున్నే వీడితో తగవు ఎందుకని శ్రీమతి నన్ను లోనికి తీసుకుపోయింది.

రోజు... రెండు రోజులు... నాలుగు రోజులు గడిచాయి. ఏ ప్రభుద్ధుడు ఇంకా కాలింగ్ బెల్ నొక్కిన పాపాన పోలేదు. నాకు మంచి పెద్ద ఇదిగా ఉంది; ఈసారి ఎవరు కాలింగ్ బెల్ నొక్కి పిలుస్తారో వాళ్ళకు మంచి కాఫీ రివార్డు ఉంటుందని శ్రీమతితో చెప్పాను.

రెండు రోజులు గడిచాయి. ఒక రోజు ప్రొద్దున్నే డింగ్ డాంగ్ మంటూ కాలింగ్ బెల్ మ్రోగింది. బెడ్ నుండి చెంగున గంతులేసి వెళ్ళాను తలుపు తీయడానికి. అంతలో శ్రీమతికి నేను చెప్పిన పాయింటు గుర్తుకి వచ్చింది. మళ్ళా బెడ్ మీద కూలబడ్డాను. "డింగ్ డాంగ్"... ఈసారి సంగీత సరస్వతి గళమెత్తి పలకరించినట్లనిపించింది. తలుపు తెరిచాను. ఎదురుగా పుస్తకం పట్టుకొని ఒక వ్యక్తి. ఆత్రతగా దాన్నందుకొన్నాను. అందులో ఎవరెవరివో పేర్లు. దాటి కెదురుగా డబ్బు రాసి ఉంది. తలెత్తి చూద్దునుగా—రోడ్డుమీద ఫ్లూట్ వాయిస్తూ ఒకడు, బాండు వాయిస్తూ మరొకడు. ఎవరో అనాథ శ్రమము పిల్లలు చందాలు సేకరిస్తున్నారు. పో పొమ్మని కూకలేశాను. కప్పులో కాఫీ పట్టుకొని వస్తున్న శ్రీమతిని చూస్తే కోపం నసాళానికి అంటింది. కాలింగ్ బెల్ నొక్కిన కథా నాయకుడికి ఇద్దామని హంసలా నడిచి వస్తోంది. కప్పు లాక్కొని పాచినోటితో గబగబా తాగేశాను. వేడి కాఫీకి నాలుక చుర్రుమంది. మా ఆవిడ వెర్రిగా చూసింది.

ఆ రోజు ఆదివారం. నాకు చాలా ఇష్టమైన రోజు. కారణం మధ్యాహ్నం భోజనం తరవాత పడుకోవచ్చు. వారానికి ఒకే ఒక రోజున దొరికిన సదవకాశాన్ని పోగొట్టుకోదలుచుకో లేదు. సుష్టుగా భోజనం చేసి ఇలా పడుకుని పదినిమిషాలు అయిందో, లేదో కాలింగ్ బెల్ మోగింది. అయినా బద్ధకించి లేవలేదు. మళ్ళీ మోగింది. ఎవరోనని డోరు తెరిచి చూశాను. ఎదురుగా ఒక వ్యక్తి. నవ్వుతూ నమస్కారం చేశాడు. ఎప్పుడూ చూడని మొహం. లోపలికి రమ్మని చెప్పి కూచోబెట్టాను. వచ్చినతను చల్లగా చెప్పాడు. ఏదో వూరు పేరు లేని ఇన్సూరెన్సు కంపెనీ ఫీల్డ్ ఆఫీసరుట. ఏజన్సీ తీసుకోమన్నట్టు చెప్పాడు. నా కటువంటివి పడవని నిక్కచ్చిగా చెప్పాను. కనీసం ఇన్సూరెన్సు చెయ్యమని ప్రాధేయ పడ్డాడు. వస్తున్న కోపాన్ని అదిమి పెట్టి అతడిని బయటకు సాగనంపడానికి పడ్డ తంటాలు ఇన్నీ అన్నీ కావు.

రాత్రి పదకొండవుతుంది. అంతవరకు అలిగి ఉన్న సత్యభామను ప్రసన్నం చేసుకొని, పడుకున్న ఇద్దరి పిల్లలను పక్కకు తప్పించి ఇద్దరం సత్యా, కృష్ణుళ్ళు సరసం చేయ దగ్గరగా చేరాం. "డింగ్, డాంగ్". ప్రాణం చివ్వుమంది. తలుపు తెరిచి చూద్దును కదా—ఒక కుటుంబరావు, రిక్షాలో అర డజను పిల్లలు, ఆడవాళ్ళు. "ఇదేది ఎలక్ట్రిక్ ఆఫీసు కదండీ" వినయంగా ప్రశ్నించా డతను.

"అవును" అన్నాను కోపంతో. ఈ పాటి దానికా లేపడము అన్నట్లు చూశాను. "సూపర్ వైజరు సుందరం గారిల్లు ఎక్కడండి?" అన్నాడు.

కుటుంబరావేమో వూరికి కొత్త లాగుంది.




ఆ ఇంటి వివరాలు అతనితో చెపితే లాభం లేదని రిక్షా వాడిని పిలిచాను. రిక్షా రాముడు ఈ లోకంలో లేదు. మొరార్జీదేశాయికి బద్ధ శత్రువు. నోరు విప్పితే నాటుసారా గుభాళిస్తుంది. సాధ్యమైనంత సహనంతో వాడికి ఆ వీథి, ఇల్లు బోధ పరిచేసరికి నిజంగా నా కళ్ళంట నీళ్ళు తిరిగాయి. రిక్షాలోని ఆడవాళ్ళు చూస్తారని ఏడవ లేదు. అలా అయితే ఐదు రూపాయలు అవుతుందంటాడు దేవదాసు. టట్ అనుకున్న దానికన్న పైసా ఎక్కువ ఇవ్వ నంటాడు కుటుంబరావు. రిక్షావాడు సామాన్యజనానికి అందుబాటు లేని బూతు భాషలో తిట్టడం మొద లెట్టాడు. నా కేమి చెయ్యాలో తోచని పరిస్థితి.

వీథిలోని ఒక రిద్దరు విసుక్కుంటూ వచ్చారు. మొత్తం మీద ఆ భాగోతం అయి ఇంట్లోకి వచ్చే సరికి సత్యభామ మూడంకెలా దర్శన మిచ్చింది. కసిగా కాలింగ్ బెల్ వైపు చూసి పళ్ళు నూరు కున్నాను.

మరునాడు లేస్తూనే కాలింగ్ బెల్ తీసి పా శాను. బహుశా శని దేవతను వదిలించు కున్న నలుడుకూడా ఇంతలా ఆనందించి ఉండడు. ఆ రోజు శ్రీమతికి ఇష్టమయిన మల్లె పూలు, మైసూర్‌పాక్ తెచ్చాను. చలి కాలం. తలుపులు బిడాయించుకుని, రగ్గులు కప్పుకుని, తలకు మఫ్లరు చుట్టుకుని చాలా వేగంగా నిద్ర పోయాం.

తలుపులు విరిగి పోతాయేమో అన్నట్లు దబదబ చప్పుళ్ళు, బయట కోలాహలం వినిపించేసరికి వూడి పోతున్న లుంగీ సర్దుకుని తలుపుతీశాను. బయట మామగారు, అత్తగారు, నా మరదలు, వాళ్ళతో పాటు వీథిలోని సగం జనాభా. ఖిలాయి నుండి దిగారు కాబోలు. మొహాలు నీరసంగా ఉన్నాయి. "ఏంటోయి చిట్టిబాబూ! పిలిచి పిలిచి ప్రాణాలు పోయాయ్. ఇంత ఆర్జించు కుంటున్నావు. కాలింగ్ బెల్ పెట్టించలేవయ్యా. నీ పిసినారి బుద్ధి పోనిచ్చు కున్నావు కాదు." మామ కమ్ మేనమామ తిట్లకు కిసుక్కుమని నవ్విన మరదలి నవ్వు జీవితంలో మరిచి పోలేను. ◆